# వారెంట్

'అసలు వానలు ఎందుకు పడడం లేదు' పలువురి ప్రశ్నల వర్షం!

'మనుషుల్లో పాపం పెరిగింది' అంటున్నారు నలుగురు.

పాపనాశనం కావాలంటే?

'పండుగలు చేయాలి' అంటున్నారు అందరు.

అందుకే పదిమంది గుడిబండకింద వున్న చింతచెట్టు కిందికి చేరి, కరువులో గూడ పండుగ చేయాలని ఆలోచిస్తున్నారు.

ఊరు పక్కమ్మటె పెద్ద బండ. బండ మీద శివుని గుడి. ఆ గుడి ఎప్పుడో వందేళ్ళ కింద నిర్మించిందట. గుడికి కొంచెం దిగువన కోనేరు. దానికి ఇంకా కిందికి చివర్న సత్రపు గదులున్నాయి. ఈ మధ్య కోనేరులో నీళ్ళు వుండడం లేదు. ఎండిపోయి, చిట్లిన రొట్టె పగుళ్ళలాగ కనిపిస్తుంది. అక్కడక్కడ క్యారిబ్యాగ్‌లు, గుడ్డ పేలికలు, కొబ్బెరి పెంకులు కోసిన పుచ్చకాయలోని విత్తుల్లా వున్నాయి. ఆ కోనేరులో నీళ్ళు వుంటేనే ఆ చుట్టుపట్టు బావుల్లో నీళ్ళు వుంటాయని అక్కడ ఓ నమ్మకం.

"చెప్పయ్య పూజారి ఏం చేద్దాం" అన్నాడు దొర ఆడబోయె నాటకంలో సూత్రధారి.

తల వెంట్రుకలకు రంగు వేయడం వల్ల దొరకు అరవై అనిపించవు. సేగ పోసిన చెట్టులాంటి గట్టి మనిషి. సన్నని ధోతికట్టి బంగారు గుండీల కమీజు వేస్తుంటాడు. చేతిలో నల్లని వెండి అంచుల పొన్ను కర్ర. అల్లికల చెప్పులు, బుర్రమీసాలు. అపుడపుడు వాటిమీద ఎడమచేయి వేస్తువుంటాడు. ఒకప్పుడు ఈయన తాత తండ్రులు పదూళ్ళకు పట్టేదార్లు. నిజాంకు తాబేదార్లు. అమ్మింది పోగా ఇంకా పాతిక ఎకరాల రేగడి, మరో వంద ఎకరాల ఎర్రచెక్క వుంది. వర్షాలు పడితేనే పంటలు. వర్షాలు పండకుంటె తొండలు గుడ్లు పెడుతుంటయి. అమ్మాలనుకున్నా కొనేవాళ్ళు లేరు.

ఊరు పక్కన పదెకరాల ఊరబావికింద పొలమే దిక్కు. ఆ పొలం రెండు కార్లు పంటలు పండుతది. ఆ పొలం ఆయనది కాదు, శివాలయం భూమి. అందులో వచ్చే పంటతోనే ఆ ఆలయపు ఖర్చులు. ఆ బావిని మొదటినుండి దొరే పాలుకు చేయిస్తుంటాడు.

"మీరు ఎట్లా అంటె అట్లానే" అన్నాడు. నుదుట విభూతి, పాత ధోతి, పసుపుపచ్చ ఉత్తరీయం వేసుకున్న ఆ ఊరి పూజారి శివయ్య.

"ఏదో ఒకటి సేయాలి." అన్నాడు జనంలోనుండి గొంగడి వేసుకున్న గొల్లడు. ఇంకా అక్కడ కర్ర పట్టుకున్న కాపులు, నడముకు ముస్తాదులతో గౌండ్ల వాళ్ళు, బట్టలమూట పక్కకు పెట్టి నిలుచున్నచాకలి, కమ్మరి, అందరికన్న ముందే వచ్చిన దళితులు, సన్నంచుదోతి కట్టి ఓ చేతిలో కొంగు పట్టుకొని అప్పుడే అక్కడికొచ్చిన కోమటి నారాయణ. ఒక్కరేమిటి అన్ని కులాలవాళ్ళు అక్కడవున్నారు.

అప్పుడే గొర్రెల మందలు పొలానికి పోతున్నాయి. వాటి వెనకాల వాటి కాపలా కాసేవాళ్లు, వాళ్ళ సంకల్లో గొడ్డళ్ళు.

"సర్పంచ్ ఎక్కడ?" అడిగారు కొందరు. ఆమె ఎందుకు అన్నట్టు చూశారు పెద్దలు.

"ఆమె మండలాఫీసుకు పోయిందట" అన్నాడు అక్కడేవున్న కారోబార్.

ఆ ఊరి గ్రామ పంచాయితి స్త్రీలకు రిజర్వ్ చేశారు. కనుక చేయి జారిపోయింది కాని లేకపోతే గత నలుబై ఏండ్ల నుండి దొర మనిషే ఉంటూ వొచ్చాడు. దొర చెప్పిందే వింటూ వచ్చాడు. అందుకే ఆ ఊరికి బస్సు రాలేదు!

"గుడికి సున్నం వేయిస్తలేరు. దేవుని భూమిలో వచ్చే పంటంత ఎక్కడబోతుందో" అన్నాడు ఓ యువకుడు గుంపులోనుండి.

"అదెంత పని ఏపిస్తాం కాని, తమర్కి లెక్కలు చూపియాల్నా" అన్నాడు దొర గుర్రుగా. దొరకు కోపం వస్తుందని ఎవరు చప్పుడు చేయలేదు. కొందరు నాలిక కరుచుకున్నారు. ఈనాటికి దొర మాటకు ఎదురు మల్లేటోళ్ళు తేలిండ్రే అనుకున్నారు.

"చెప్పరూ పూజారిగారు" అన్నాడు దొర.

ఈ నాటకం కొత్తేమికాదు. తరతరాలనుండి వస్తున్నదే అనుకుంటూ చెట్టు కొమ్మల వైపు చూస్తున్నాడు పూజారి. ఆ రెమ్మలకు సాలె గూడుంది. ఇంకొంచెం పైన కాకి గూడుంది.

"ఏముంది మన చిన్నప్పుడు ఇట్లనే వర్షాలు రాకుంటే మన పెద్దలు దేవునికి కన్యాదానం చేయించి, సక్తిపూజలు చేయించిండ్రు గుర్తుందా? మనం కూడా అట్లానే చేయిస్తే సరి" అన్నాడు పూజారి. అప్పుడు ఆయన ఉత్తరీయం మీద కుమ్మరి పురుగొచ్చి వాలింది.

"అంతేనంటారా?" అన్నాడు దొర. తలమీద తిరుగుతున్న కందిరీగను చూస్తూ.

జనంలో గుసగుసలు, అర్ధంగాని సక్తిపూజ గురించి తర్జనభర్జనలు.

"సరె" అన్నట్టు తలవూపి "ఏం నిర్ణయం తీసుకున్నది చాటింపు చేయిస్తాం. అంతా కలిసి తీసుకున్న నిర్ణయంగా భావించాలి" అన్నాడు దొర ఏదో శాసనాన్ని ప్రకటించినట్లు. దొరలు చెప్పడం, జనం వినడం ఎప్పటి నుండో వస్తున్న రివాజు.

"అంతే" వంత పాడాడు పూజారి. అందరు తలలూపి కొందరు పని పాటలకెళ్ళి పోయారు.

"దొర మాట కాదంటామా?" అన్నాడు షావుకారి నారాయణ. ఆయనకు తెలుసు ఊళ్ళో ఏది జరిగినా తనకే ఎంతో కొంత లాభమని.

00

నడి ఊళ్లో వేపచెట్టుకింద ఓ బొడ్రాయి. రాయికి పసుపు, కుంకుమ పూసి మొక్కులు మొక్కుతూ వుంటారు. కోళ్ళు కోస్తూ, కల్లు, సారాలు పెడుతుంటారు. దానికి కొంత దూరంలో దొర గడి. గడి అంటే కోటలాంటిది కాదు. ఓ పెద్ద ప్రహారిగోడ గల ఓ బంగ్లా. గడిలోని బంకుల్లోల్లో కుర్చీల్లో దొర, పూజారి కూర్చోని వున్నారు.

దొర శావకపు రాములును పిలిచి-

"అరె తలుపు మూసిరా" అన్నాడు. నలభై ఏళ్ళ రెక్క బలం గల రాములు పెద్ద దర్వాజ రెండు రెక్కలను ఒకేసారి మూసి గడియవేశాడు. వేరే ఇంకెవ్వరైనా ఒకరెక్క తరువాత మరోరెక్క మూయాల్సిందే. బయటివాళ్ళతో కూర్చున్నప్పుడు దొర బంకుల్లలోనే కూర్చుంటడు. అక్కడ నాలుగు కుర్చీలు ఓ టీపాయ్ ఎప్పుడూ వుంటాయి.

'పట్టుకరా' అన్నట్టు చూశాడు దొర రాములు వైపు. రాములు గడిలోనే పుట్టాడు. ఆవుల పచ్చిపాలు తాగి దిట్టంగా పెరిగాడు.

'సరె' అన్నట్టు తల ఊపి లోపలికినడిచి, ఓ పల్లెంలో సీసా, రెండు గ్లాసులు, రెండు సాసర్లలో ఏంపిన ఎండు మాంసం ముక్కలు తెచ్చి టీపాయ్ మీదుంచాడు.

వాసన పట్టినట్టున్నవి రెండు చిట్టెలుకలు ఎదురెదురుగా పరెగెత్తినయి.

'వొంచురా' అన్నట్టు సైగచేశాడు దొర. రాములు గ్లాసుల్లో సారాను వొంచి అందించాడు.

"కావాలంటే సీమ సరుకుంది" అన్నాడు దొర.

ఇద్దరు నవ్వుముఖాలతో నోట్లోకి వొంచుకుని, మాంసముక్కలను నోట్లో వేసుకున్నారు.

"సీమ సరుకు దీని మీద దండగే. ఇదే శ్రేష్ఠం. ఎల్లిపాయ కారం చల్లినట్టుంది బహురుచిగ వున్నాయి. తమరే బట్టి దింపించారుగ, బహు నికారస్గ వుంది." అన్నాడు పూజారి.

"అయితే కానియ్. ఆ ఇగ జెప్పు. గుడిదగ్గర ఏమో అంటివి" అని వొంపు అన్నట్టు రాములు పైపు చూశాడు దొర.

రాములు గ్లాసుల్లో పొంపి అందిచాడు. 'తరువాత రాపో' అనే సైగతోనే రాములును అక్కడి నుండి పంపాడు.

"మన శివాలయం లోని శివుడు గంగనొదిలితె ఈ బాదలన్ని వుండక పోవు దొర వారు. ఇదే అదును. ఆట మొదలుపెట్టాలె. ఎవ్వరు కాదనరు. మొన్న మనం చూసినంచూడు పట్నంపిల్ల అదే రంగి కూతురు గులాబీపువ్వు, ఆ ఎత్తు, ఎత్తుకుతగ్గ వంటి పుష్టి, ఆ అందచందాలు దానిని దేవునికి కన్యాదానం చేయమని కులపెద్దలకు చెప్పాలె" అన్నాడు లొట్టలేసుకుంటు.

"అవును నాకు ఇప్పుడు గుర్తొస్తుంది. ఆ రెజుల్లో అట్లావొదిలిందే కదు రంగిని శానేండ్ల కింద" అన్నాడుదొర

"కాని బిడ్డను? –" అంటూ ఆగాడు దొర.

"ఎందుకిడవదు. వర్షం సమస్య, ఊరిసమస్య, తల్లోత్నే దానికి పుట్టిన బిడ్డకూడ. చూడు చాల ఈజీ. ఎందుచేతనంటె ఓ తండ్రి లేడు, ఓ అన్న–దమ్ముళ్ళు లేరు. ఏ సమస్య వుండదు" అన్నాడు గ్లాసులో పున్నదాన్ని నోట్లోవేసుకుని, కాసేపు కళ్లుమూసుకుని గ్లాసు టీపాయ్ మీదుంచగా ఈసారి దొరే వంచుతు–

"నీవనేది నిజమే అనుకో కాని బాగ చదువుకున్నది, వప్పుకుంటదా" సందేహాన్ని వెలిబుచ్చాడు తన గ్లాసులోకి వంచుకుంటూ దొర.

అమ్మాయి గుర్తుకు రాగానే నోట్లో, శరీరంలో సార పొంగింది. అర్ధరాత్రివరకు ఆలోచించారు. రేపు కుల పెద్దలకు చెప్పేయాల్సిందే అని నిర్ణయించారు.

"రామా, అయ్యోరిని ఇంటికి పంపిరా" అంటూ లోపలికి నడిచాడు. హోల్లో దొరసాని టీవీ చూస్తూ కూర్చుంది దొర రాగానే "ఏం కాలమో నిండుగ బట్టలు వేసుకోవల్సిన ఆడ పిల్లలు పేలికలతో గంతులు వేస్తున్నారు. అబ్బాయిలేమో నిండుగ బట్టలు తొడుక్కుంటున్నారు" అంటూ లేచి నిల్చుంది వళ్ళు విరుచుకుంటూ.

"ఎవరిష్టం వారిది"

"చూసేది మనం కదా?"

"నీవు చూడకు. నేను చూస్త " అంటూ మంచం మీద వరిగి టీవీ చూస్తూ వున్నాడు. టీవీలో ఆ పట్నం పిల్ల అర్ధ నగ్నంగా కనిపించింది, రెప్ప కొట్టడం మానేశిండు. కాసేపటి తరువాత నిద్రలోకి జారుకుండు.

రాములు మిగిలిన సారను, వదిలిన ముక్కలను నోట్లోవేసుకొని–

"పదండి పంతులు ఇంటికి పోదాం" అంటు సంకలో ఓ చేయివేసి మరో చేయితో తలుపు తెరిచి, అయ్యగారి ఇంటివైపు నడిచారు. పూజారి ఇంటి తలుపు కొట్టిన చప్పుడువిన్న అమ్మగారు తలుపు తెరిచి, అయ్యగారి అవతారం చూసి, ఓసారి ఆవలించి మంచంమీద పడుకో పెట్టమన్నట్టు సైగచేసింది, రాములు

పడుకోబెట్టాడు. "ఏం తాగుడమ్మ గారు, ఒకటే తాగుడు" అన్నాడు రాములువిసుక్కుంటు.

"ఒరే రాముడూ, ఒకే పక్కమీద పడుకుంటే జబ్బ పట్టుకుందిరా. కొంచెం ఈ రెక్కను గుంజరా" అంది. రాములు ఆమెచేతిని సంకలొ అదిమిపట్టి, మెడదగ్గరి నుండి జబ్బను అదుముతూ వచ్చి ఒక్కొక్కవేలునే గుంజి వదిలాడు.

'అబ్బా' అని కళ్ళు మూసి తెరుస్తు "పొద్దున అయ్యగారు గుడి దగ్గర ఏం చెప్పిండ్రా" అని అడిగింది.

"ఏదో సత్తిపూజ చెయ్యాలట సత్తి అంటే, ఏమిటి పంతులమ్మగారూ" అని అడిగాడు రాములు.

దొర ఇంట్లో అప్పుడప్పుడు నాలుగు అక్షరాలు పిల్లలతో పాటు నేర్చుకున్నాడు రాములు. దొరల ఇండ్లల్లో సంబంధాలు గమ్మత్తుగ వుంటాయి. దొరసానికి పుడితె దొర అవుతాడు. అదె దాసికి పుడితె పనోడు అవుతాడు. ఇద్దరికి తండ్రి దొరే అది రహస్యం. అలా పుట్టిన వాడే రాములు.

"సత్తి అంటే చెప్పొచ్చుగాని, సక్తి అంటే మాత్రం నోటితోని చెప్పలేన్రా" అంటు నవ్వింది పూజారి భార్య.

"అయితే చూపియ్యండి" అని అమాయకంగా అడిగాడు రాములు.

ఆమె ముసిముసిగా, నవ్వుతూ "మల్లెప్పుడన్న చూద్దాం" అంది.

'ఏమిటో' అనుకుంటూ తన ఇంటివైపు నడుస్తూ వుంటె తోవ పక్కన ముడుచుకుని పడుకున్న కుక్క గుర్రమంది. అదేమి పట్టించుకోకుండా సత్తీ, సక్తిలంటే మాటలు ఒకే తీరుగవున్నయి. అర్థాలు వేరువేరుగ వున్నాయా అని ఆలోచిస్తూ ఇల్లు చేరుకున్నాడు.

ఉదయాన్నే దేవుని బండ దగ్గర అయ్యగారు నిలుచున్నారు. రాములు దొరగారి గేదెలను ఊరవతలికి కొట్టి తిరిగొస్తుంటే "రామా నీ పేరు బాగా పెట్టార్ర. నిన్ను పిలిచితె దేవున్ని తలిచినట్టుంటదిర" అన్నాడు నవ్వుతూ అయ్యగారు.

"పెద్దలు అంతమాట అంటే ఎట్లా పంతులూ" అంటు కర్రను సంకలో పెట్టుకుని చేతులు జోడిస్తు ఆగాడు.

"నాలుగు పళ్ళపుల్లలు అందుకో" అంటూ ఎదురుగా వున్న వేపచెట్టును చూపించిండు.

అట్లనే పంతులూ అంటూ చెట్టును బాకి, రెమ్మలను విరిచి ఆకులను దుశ్శేసి పుల్లలు తెచ్చియిచ్చి – తలగోక్కుంటూ నిలుచున్నాడు.

'ఏంటిరా సంగతి?' అన్నట్టు చూశాడు.

"నిన్న సత్తి పూజ చెయ్యాలంటిరి అదేందయ్యగారు" అడిగాడు రాములు.

"ఓ అదా సత్తి పూజకాదురా సక్తి పూజ. అంటే తొడపూజ అని అర్థం" అన్నాడు.

"మరైతే తొడపూజ సేపిస్తరా" అని అడిగాడు రాములు నవ్వుకుంటూ.

పూజారి నవ్వి 'అవును' అన్నట్టు తలాడిస్తు ఓసారి కళ్ళు మూసి తెరిచాడు.

"ఏమి పూజలో ఏమో దేవునికి పూజ, దయ్యానికి పూజ, అన్నిటికీ పూజలే" అంటు చిన్నగా నవ్వాడు.

" ఎవరికి వారు పూజలు చెయ్యరు. అయ్యగార్లతోటి చేపిస్తం. అట్ల జేపిస్తె మరి పుణ్యం చేసినాయనకా, చేయించినాయనకా" అని రెట్టించాడు రాములు.

పూజారి ఇరుకున పడ్డట్టు ముఖం పెట్టాడు.

"రాముడూ, ఇదిగో ఈ పళ్ళపుల్లలను ఇంట్లో ఇచ్చిపోరా" అన్నాడు.

'సరే' అన్నట్టు తలూపి అక్కడినుండి కదిలాడు రాములు. ఏదేదో ఆలోచిస్తూ నడి ఊళ్ళో నుండి పోతుంటే, చీరెకుచ్చుళ్లు పైకి చెక్కి ముగ్గేస్తున్న స్త్రీ వైపు చాటుగ మాటుగ చూస్తూ నడిచాడు.

ఎందుకో ఆ పదానికర్థం తెలుసుకున్నాక రాములుకు ఓ మాదిరి ఆరాటం మొదలైంది.

మాటల అర్థం తెలవనప్పుడు మనస్సు కూడా దేనిని పట్టించుకోదు. అర్థం తెలిసినాకనే అవస్థలు. నీటిలో రాయేస్తె నీరంతా కదిలినట్టు మనసులో ఓ మాటేస్తె మనస్సంతా కదులుతుంది. ఇప్పుడు రాములు పరిస్థితీ అంతె. పంతులమ్మ గారు 'చూపిస్తలే' అని ఎందుకన్నట్టు, ఎట్లన్నట్టు అని పదేపదే గుర్తుకు తెచ్చుకుంటూ నడుస్తున్నాడు.

మాట మత్తునిస్తుంది. మాట శక్తినిస్తుంది. మాట కొత్త ఆలోచన లేపుతుంది. మాట మంచిని పెంచుతుంది. మాట మనుషులను దగ్గరచేస్తుంది. అదే మాట మనస్సును విరిచేస్తుంది. మాటకున్న శక్తి మరేదానికి లేదు.

గడిలో దొరసాని గూడ ఒక్కొక్కసారి సిగ్గూ బిడియం లేకుంట మాట్లాడతది. 'నీ-మీద తందునా' అంటది. ఎంత బరితెగించిన మాట! ఈ పెద్దోల్లంతా ఇట్లనే మాట్లాడుతరా? అనుకుంటూ నడకలో వేగాన్ని పెంచాడు. దొరసాని మొదటికంటే ఇప్పుడు నయమే. పెద్దబిడ్డ మతి తప్పినప్పటి నుండి మారిపోయి దొరలు చేసే పాపపు పనులను ఎత్తి చూపుతూ 'వీళ్ళ సంతానం ఇందుకే ఇట్లా పాడపడతది' అంటూ గొణుగుతుంటది.

00

సర్పంచ్ ఉదయమే పంచాయితి కార్యాలయంలో ఆనాటి దినపత్రిక జిల్లా ఎడిషన్‌ను తిర్గేస్తూ నిలుచుంది. కారోబార్ ఊడిచేవాళ్ళ గూడల్లోకి పంపిస్తున్నాడు. ఏడుపు ముఖంతో ఆదల బాదలోచ్చిన రంగమ్మ సర్పంచ్ పాదాలమీద పడి-

"అమ్మా తమరే కాపాడాలి తల్లీ. తమరు చూస్తునే వున్నారు గద తల్లి నా బతుకే నాశనమయింది. నాబిడ్డనన్నా కాపాడండి."

చదువుతున్న పేపరును పక్కకు పడేసి రంగమ్మను లేవనెత్తుతూ "సంగతెందో చెప్పు ఆలోచిద్దాం, గాబరాపడకు" అంది తల నిమురుతు. సర్పంచి చదువుకున్న

స్త్రీ. టౌనులో పుట్టి టౌన్‌లో పెరిగి ఈ ఊరికి కోడలుగా వచ్చింది.

"నిన్న చాటింపు వినగానే నాపై ప్రాణాలు పైనే లేచిపోయినట్టు అయిందమ్మా. నా బతుకునే నాశనం సేసింది ఈ వూరు. ఆ రోజుల్లో ఈ ఊరికి అంతా ఆళ్ళదే పెద్దరికం. ఆల్ల ఆటలే సాగినై. ఇప్పుడు ఈ ఊరికి పెద్ద మీరు. తమ నిర్ణయమే జరిగితీరాలి. ఎట్లనైన దీనిని తమరు ఆపాలె. ఆరోజుల్ల నా తల్లితండ్రులు అమాయకులు. ఊరిపెద్దలు ఏదిచెప్పితే అదివినేటోల్లు అందుకే పేదోని ఆడది అందర్కి ఆలైంది" అంది రంగమ్మ.

"ఇప్పుడా కాలం గాదు అట్లా జరుగదు. నిన్న నేను మండలాఫీసుకు వెళ్ళి తిరిగొచ్చేసరికి రాత్రి అయ్యింది" అని ఏదో రాసుకుంటున్న కారోబార్‌ను పిలిచి-

"పుల్లయ్యా నిన్న ఏమని చాటించారు. ఎవరు చాటించమన్నారు" అని అడిగింది.

"దొర, పూజారి అయ్యగారు చాటించమన్నారట"

"వానలు పడక నాలుగు ఏండ్లనుండి వరుసగా కరువొచ్చి ఊరు తల్లడిల్లిపోతుంది. ఆచారం ప్రకారం ఓ కన్యను జెన్నెకిడిస్తే దేవుడు సంతోషించి వానలను కుర్పిస్తడట. అందుకని రంగమ్మ బిడ్డ విమలను జెన్నెకిడువాలని గ్రామ పెద్దలు నిర్ణయించినారని, సాటింపు చేయించినారమ్మా" అని వున్నది వున్నట్టు చెప్పాడు కారోబార్ పుల్లయ్య.

"ఈ దుర్మార్గులు మొదటినుండి ఇంతే. నలభై ఏండ్ల కింద ఇట్లనే అని నన్ను నాశనం జేసింద్రు. ఇప్పుడు నా బిడ్డెమ్మటి పడ్డరు" అంటు కుమిలి కుమిలి ఏడుస్తుంటే ఆమె మెడనరాలు వుబ్బినయి. పెదాలు వంకరపోతూ నోరు, ముక్కు ఓ మాదిరి చిక్కటి ఉమ్మిని కారుస్తున్నాయి.

"అప్పుడు నాకు పన్నేండేండ్లు, ఈ దొర తండ్రే ఎంకట్రావ్, రచ్చబండమీద కూర్చోని ఊరందర్ని పిలిచి వానలు పడతలేవు. ఊరికి ఉపకారం జరగాల్నంటే ఓ కన్నెపిల్లను జెన్నెకిడువాలని, గ్రామ పెద్దలతోని జెప్పించి, నా తండ్రిని వొప్పించి, కత్తికి బాసింగం కట్టి లగ్గం జరిపించింద్రు. అది నాకు ఇష్టంలేక తల్లడిల్లిపోయిన, నెత్తి నోరుకొట్టుకున్న. మా కులపోల్లు దొరిచ్చిన పైసల్తోని తినితాగి పండగ చేసుకున్నరు.

ఒకరోజు తలంటు పోసి కొత్తవల్లె కట్టి పూలుపెట్టి, మా నాయనమ్మనిచ్చి గుడి దగ్గర నిద్రచేయాలని పంపింద్రు, ఆ రాత్రి గుడిలో నుండి పచ్చికొబ్బెర తెచ్చిచ్చింద్రు. నాయనమ్మ తినమని నా దిక్కు జూస్తు ఏడుస్తుంటె నాకెటు తోయలేదు. ఈ రోజు నీ కలలదేవుడొస్తడు. కదలకుండ పండుకో. కదిల్తే దేవునికి కోపమొస్తదని ఏడుసుకుంట చెప్పింది నాయనమ్మ. మరి నీవెందుకు ఏడుస్తున్నవే అంటే, మనల ఆ దేవుడు ఆడపుట్టుక పుట్టించినందుకు- అందులో, ఈ సాకిరీకులంల పుట్టించినందుకు ఏడ్వక ఏంచేయను అంది. అందుకని కదలకుండ

పడుకున్న. నడిరేతిరి ఎవరో నా ఎదను తాకినట్టు అనిపించింది. తెల్లారెసరికి కట్టుకున్న వల్లె నలిగింది. నాయనమ్మ ఇంటికి తీసుకపోయి తానమాడించెటప్పుడు జెప్పింది రాత్రి దొర నీకు కన్నెరికం పెట్టిండని, కొంగుల రూపాయి బిల్ల కట్టిండని చూపించింది."

"అంటే నీకు తెలియకుండానే అంతా జరిపించిండ్రన్నమాట. అయితే వర్షం గుర్సిందా?" అని అడిగింది సర్పంచ్.

"వర్షం లేదు గిర్షం లేదు. అంత దొంగనాటకం. ఆ పేరు మీద కన్నెపిల్లలను ముసలోల్లు... ఏంజెప్పను తల్లి–" అని కాసేపు ఆగి

"ఇంక అప్పటి నుండి అందరు నన్ను ఓ తీరుగ జూసేటోళ్ళు. పంటలప్పుడు ధాన్యాన్ని ఇచ్చేటోల్లు. పండగలప్పుడు పైసలిచ్చేటోల్లు. నేను వాకిట్ల అడుగుపెట్టినా, కల్లంల కాలుపెట్టినా ఎల్లమ్మొచ్చిందనుకునేటోల్లు. ఎప్పటివరకు? నా వయస్సున్నంత కాలమే. ఆ తరువాత బతుకంత సీకటే. ఎపుడన్న అలసి సొలసి కుదరదంటే బెదిరించేటోళ్ళు" తన్నుకొస్తున్న దుఃఖాన్ని అణచుకుంటూ కొంగుతో కళ్ళు వత్తుకుంది.

'చ్చొ చ్చొ' అంది సర్పంచ్. రంగమ్మ రాలిని జుట్టును, నల్ల కనుపాపలు వెలిసి, తెల్లగ సీసపు గోళీల్లాగ మారిన కళ్ళను చూస్తూ– 'ఎంత మంది ఈమె యవ్వనాన్ని జుర్రుకున్నారో, ప్రౌఢత్వాన్ని పీల్చివేశారో వట్టి పిప్పయిపోయింది కదా!' అనుకుంది

"పిల్లలు కాకుండా చాలా ఏండ్లు పసరు తాగేదాన్ని. తండ్రిలేని పిల్లలను ఈ లోకం ఎట్ల జూస్తదో తమరికి తెలుసుగదా? ఎంత తిప్పంచుకున్నా ఎట్ల నిలిసిందో నిలిసింది. అక్కడికీ తీసేయించుకుందామనుకున్న కాని ఎందుకో తల్లిని కావాల్నని నా పాణం తల్లడిల్లింది. ఆ బిడ్డే ఈ విమల. ఐదేండ్ల వరకు ఈ వూళ్ళేనే పెరిగింది". ఓ బరువైన శ్వాస పీల్చి – "ఒకసారి సుస్తిచేస్తె తెల్లోల్ల దావఖానకు తీసుకపోయిన. అక్కడ పెద్ద డాక్టర్ తండ్రి పేరడిగిండు. నేను జెప్పలేకపోయిన. ఆయనే అన్నీ అడిగి తెలుసుకుని ఆ తరువాత మాకిస్తె మేము పెంచి పెద్దసేస్తం, సదివిస్తమన్నరు. బాగా ఆలోసించిన, నాదగ్గర వుంటె బట్ట–పొట్టకే కష్టం. చేస్తే కూలి లేకపోతే పస్తు. బిడ్డన్న మంచిగ బతుకుతదని పాదర్ కు ఇచ్చేసిన. అక్కడ్నె పదిహేనేండ్లు ఒకపక్క సదువుకుంట, ఇంకోపక్క రోగులకు సేవచేసుకుంటొచ్చింది. ఆ మద్దెన ఆ దావఖానను మూసేసి ఆ పాదర్ వాళ్ళ దేశం ఎల్లిపోయిండు. చేసేదిలేక అమ్మాయి తిరిగొచ్చింది" అంది బాధగ.

"ఇంతకూ ఎంతవరకు చదివింది?" అడిగింది సర్పంచ్.

"నాకు సరిగ తెల్వదు పదిహేను సదివిందట" అని చెప్పింది రంగమ్మ.

"గట్ల సదువుకున్నది గీపనికొప్పుకుంటదా, జర్రసెప్పుతల్లీ నీ కాల్లు మొక్కుత"

అంది మళ్ళి తానే కొంగుతో ముక్కు తూడ్చుకుంటు.

"ఈ రోజు జిల్లాలో మీటింగ్ వుంది. రేపు అక్కన్నే కొంచెం పనివుంది. అట్లనె అక్కడి మన మహిళ సంఘపోల్లతో మాట్లాడి వాళ్ళ సాయంగూడ కోరుత. ఈ రోజుల్లో మాత్రం ఇది జరగని పని, నీవేం భయపడకు" అంది సర్పంచ్.

'సరే' అన్నట్టు తలాడించి "తమరే దిక్కు" అంటూ చేతులెత్తి నమస్కరించి అక్కడి నుండి వెళ్ళి పోయింది.

'ఈ రోజుల్లో కూడ వీళ్ళు ఇంత దారుణానికి పూనుకుంటే ఎట్లా? ఈ విషయం దొరసానికి తెలుసో? ఆమె పంజరంలో పక్షి. బయటికి రాదు. లోపలికి ఎవరు పోలేరు' అనుకుంటూ ఓ చీటి రాసి కార్‌బార్ చేతికిస్తూ "జాగ్రత్త" అంది.

00

సర్పంచ్ ఇంకా రాలేదు. అదే అదును అనుకుని దొర పూజారి వర్నాల పేరుతో అందర్నీ ఒప్పించిండు. కాదన్న రంగమ్మను దొరగడిలోనే కట్టిపడేశినారు. ఆమె ఏడుపులు గడి గోడదాటి రాలేవు. వొచ్చినా పట్టించుకునే నాదుడేలేడు. తన వాళ్ళేమో కొమ్ముల్లేని ఎడ్లు. మిగిలిన వాళ్ళు గంగెద్దులు. దొరలకు మోకాళ్ళ మీద వంగి దండం పెడతాయి. కాసేవాని ఎదమీద పాదాలు పెడతాయి.

ఈ దేశంలోని గడీలల్లో, కోటలల్లో ఎంతమంది యువతుల గొంతులను నొక్కేశారో, ఎందరి మాన ప్రాణాలను పాతేశారో వాటిల్లోని పడక గదుల కథలు కథలుగా చెపుతాయి. స్నానాల గదులు సాక్ష్యమిస్తాయి.

కొట్టి తిట్టి, కొత్త బట్టలను కట్టించి, బండమీద శివుని గుడి దగ్గర ఉత్సవ విగ్రహం పక్కన విమలను బలవంతంగా బాసింగాలు కట్టి పుస్తె కట్టించి పెళ్ళి జరిపించారు. రేపు కాదంటదో ఏమోనని ఫోటోలు కూడా తీయించారు. ఈ విషయం పోలీసులకు తెలవకుండా ఊరంతా కట్టడి చేశారు. మాట జారినా కట్టడి కాదన్నా గ్రామ బహిష్కరణ అన్నారు.

విమల వందేండ్ల జీవితానికి నిప్పంటుకోగా గడగడ వణికిపోయింది. గిలగిల తన్నుకుంది. వలవల ఏడ్చింది.

ఎంత తప్పించుకుందామన్న వీలు చిక్కనీయలేదు. తనవాళ్ళందరు నోరు మూసుకున్నారు. ఇది ఈనాటిదా ఎప్పటినుంచో వస్తున్న ఆచారమన్నారు. అంతేకాదు తల్లినే చూపించి చేతులు దులుపుకొన్నారు.

ఈ తతంగాన్ని చూస్తూ గుసగుసలే. కాని ఊరంతా నోరు విప్పలేదు. మూఢాచారాలు మనుషుల కళ్ళను కప్పేస్తాయి. నోళ్ళు మూసేస్తాయి. దేన్ని కాదంటే ఏం ముంచుకొస్తుందో అనే భయం అందరికీ కలిగింది. మా కులపుది కాదు. మా మనిషి కాదు అన్నట్టు చూస్తువుండిపోయారే తప్ప ఎవరూ నోరు విప్పలేదు.

ఈ విషయం తెలుసుకున్న బడి పంతులు "ఈ రోజుల్లో కూడానా?" అన్నాడట.

'అయ్యా పిల్లలకు చదువు జెప్తే చాలు. సలహాలు ఏమవసరం లేదన్నా'రట. అంతే, ఆ విషయాన్ని మళ్ళీ ఎత్తనేలేదట. అంతేకాదు తనను కూడ ఓ చూపు చూసుకోమన్నారట. ఇక మళ్ళీ మాట్లాడలేదట ఆ బడిపంతులు.

కర్ఫ్యూ కంటే కఠినమైన గ్రామ కట్టడి ఎవర్నీ నోరు తెరువనీయలేదు.

విమల గొంతు మూగబోయింది. మెడకున్న తాళి ఉరితాడుగ, కొత్తబట్టలు వంటికి కంపరం లేపుతున్నట్టు, కాలికి తొడిగిన మెట్టెలు వేళ్ళను కోస్తున్నట్లు అనిపించింది. జరిగేదంతా చూడలేక సూర్యుడు పడమటి వైపు వాలిపోతున్నాడు. విమల చూపులు తల్లికోసం వెతికాయి. కాని ఆమె అలికిడిలేదు. ఎక్కడో బంధించివుంటారని ఏడుస్తూవుంది. తాను చదువుకున్న రోజులు గుర్తొచ్చాయి. ఆడిపాడిన స్నేహితురాళ్ళు గుర్తొచ్చారు. పెంచి పెద్దచేసిన ఫాదర్, బ్రదర్స్, సిస్టర్స్ గుర్తొచ్చారు. చర్చి గుర్తొచ్చింది. చర్చిలోని సిలువ గుర్తొచ్చింది. ఎవరు గుర్తొచ్చినా ఈ ఆపదనుండి తనను రక్షించలేరని ఏడుస్తూవుంది.

ఒక మనిషి తన కుయుక్తులతో, తన చెప్పుచేతుల్లో వున్న వ్యక్తులతో మరొక మనిషిని శారీరకంగా, మానసికంగా బాధిస్తుంటే, వేధిస్తుంటే ఏ దేవుడూ తప్పించలేడు. మళ్ళీ మనుషులే కావాలి.

00

తల్లీ-బిడ్డ తమ బతుకులు పాడైనందుకు ఒకర్నొకరు పట్టుకొని ఏడుస్తువున్నారు.

"అమ్మా ఎక్కడికన్న పోదాంపద" అంది విమల.

"ఎక్కడపోతం బిడ్డా ఊరుచుట్టూ కాపలా పెట్టించిండు దొరోడు. అని తలపండు పగల, వాని మొలతాడు తెంపెయ్య" అంది.

ఎట్లా తప్పించుకోవటం అని ఆలోచిస్తుంది విమల. విమల నిండుగ ఆరోగ్యంగా వుంది. ఆరోగ్యంగవున్న మనిషికి ఆలోచనలు చురుగ్గా వుంటాయి. గుండె ధైర్యం కూడావుంటుంది. తల్లిరాగానే విమలకు కొండంత అండ దొర్కినట్టయింది. నీరసం పోయి ఆలోచనలు చురుగ్గా పనిచేస్తున్నాయి.

"తాలిని తెంపేస్త, మెట్టెలు తీసేస్త" అంది కోపంగా.

"వద్దు బిడ్డా వద్దు. మల్లగదుతరు. ఇప్పుడు నీవు రెక్కలు ఇరిగిన పక్షివి" అంటూ బిడ్డను తన తలకు ఆనించుకుని ఏడుస్తూ తలపైకెత్తి ఓసారి కళ్ళుమూసి తెరిచింది. ఆకాశంలో ఎగిరిపోతున్న పక్షుల గుంపొకటి కనిపించింది. కళ్ళు తుడుచుకొని రంగమ్మ, బిడ్డ ముఖాన్ని కొంగుతో తూడుస్తూ, జెర్ర ఓపికపట్టు, నాకెందుకో ఈ గండం గట్టెక్కుతదని పిస్తుంది" అంది.

పక్షుల గూళ్ళు చేరే వేళ్ళ, పశువులు ఊరు చేరే వేళ్ళ.

పూజారి సత్రం దగ్గరికి వచ్చి రంగమ్మను పిలిచి-

"దొరచెప్పి రమ్మండు. ఈ రాత్రికె నీ బిడ్డకు కన్నెరికం. సిద్దంగా వుంచు" అని కొన్ని నోట్లను బెదిరి బెదిరి చూస్తు అందించాడు. సత్రం గోడపక్కన ఓ తొండ మిడతను అందుకోజూస్తుంది. కాని తొండ నోరు తెరిచినపుడల్లా మిడతపైగెగురుతు తప్పించుకుంది.

పూజారి రంగమ్మకు మరీ దగ్గరై కండవా కొంగున కట్టిన ముడివిప్పి సన్నని బంగారు గొలుసును రంగమ్మ చేతిలో వేసి దొర రాత్రి తొమ్మిది గం॥లకు మూర్తం పెట్టమంటే పెట్టిన. అని కాసేపు నస్కి "అంతకంటే ఓ గంటముందే నేను వస్తాను. నీకు తెల్వంది ఏముంది? ఈ గొలుసు వుంచుకో. సరిగ్గా టైంకు వచ్చేస్త. పూజారిని కదా మొదటి పూజ నేనే చేస్త. ఎంతైనా ఊరి పూజారినిగదా! ఏ మాత్రం ఈ విషయం బయటికి పొక్కెనా బాగుండదు సుమా. కొత్త పథకం వేసి ఉతికి ఆరేస్తాను. హాఁ" అన్నాడు.

రంగమ్మ ఏం మాట్లాడలేదు. మౌనంగా నిలుచుంది. పూజారి గుడిలోకి వెళ్ళి ఓ పూలదండను, మరో కొబ్బరి చిప్పతెచ్చియిచ్చి "దేవదాసీ/ఆలయానికి చెందిన బ్రాహ్మణునితో ప్రథమ సంయోగం విధిగా జరగాలి. అది మొదటినుండి వస్తున్న ఆచారం. సరేనా" అంటు వెళ్ళిపోయాడు.

కొంతదూరం నడిచినాక ఆయన వెనకాల ఓ యువకుడు మౌనంగా నడుస్తున్నాడు. బహుశ అతను గుడి వెనకనుండి వచ్చినట్టుంది.

విమల మోకాళ్ళమీద తలనుంచి ముఖం ఓ పక్కకు తిప్పి ఆలోచిస్తూ వుంది. అప్పుడప్పుడు కులపోల్లు వొచ్చి చేసేదిలేక అంగలార్చిపోతున్నరు. వేరే కులపు ఆడవాళ్ళు వొచ్చి దొరను, పూజారిని తిట్టిపోతున్నరు.

చెట్లమీద కాకులు, కొంగలు కలిసి అరుస్తున్నాయి. గుడిలో, సత్రంలో లైట్లు వేసివెళ్ళాడు ఆలయ కాపలాదారు. తల్లిబిడ్డలు ఇద్దరు సత్రపు గదిలోకి వెళ్ళి ఈత చాపను పరుచుకుని కూర్చున్నారు. రంగమ్మకు దుఃఖం ఆగడం లేదు.

రంగమ్మా అంటు పిలుస్తూ ఓ లోతు గిన్నెలో అన్నం, అన్నం మధ్యన మరోచిన్న గిన్నెలో కూర, వాటిమీద నాలుగైదు విస్తరాకులను కప్పుకుని తెచ్చిన రాములు ఓ మూలనుంచాడు. రాములు వెనక ఓ ముసుకు మనిషి లోపలికొచ్చి నిలుచుండడం చూసిన రంగమ్మ-

'రామన్న ఈ ముసుకు' అంటు బిత్తరపోయింది రంగమ్మ.

'షూ' అంటు నోటిదగ్గర చూపుడు వేలుంచి కళ్ళతో సైగచేసి తాను బయటికొచ్చి నిలుచున్నాడు రాములు. ముసుగు మనిషిని చూడగానే విమల కంగారుపడి దొరోడు కాదుకదా అనుకుని క్షణం అలాగే చూస్తుండిపోయి, తమాయించుకొని ముసుకు మనిషి పాదాలవైపు చూసి కాస్త కుదుటపడింది.

తల్లిని అటువైపు చూడమని సైగజేసింది. తల్లి ఆ పాదాలకున్న మెట్టెలను చూసి కాస్త ధైర్యాన్ని తెచ్చుకొని లేచి నిలుచుంది. విమల నిలుచుంది. ముసుగు మనిషి విమలను దగ్గరికి తీసుకుని చెవిలో ఏదో చెప్పింది. ఓసారి ముసుగు తొలగించింది. "అమ్మా తమరా" అంటు పాదాలమీద చేతులుంచి వాటిమీద ముఖాన్ని వుంచింది రంగమ్మ. విమల కృతజ్ఞతాపూర్వకంగా చేతులు జోడించింది. దొరసాని మనిషి మళ్ళి ముసుగును సర్దుకుని వెనుతిరిగిపోతుంటే వెనుక రాములు నడిచాడు.

"అమ్మా ఎవరీమె" అని అడిగింది విమల.

"దొరసాని" అని చెప్పింది తల్లి.

"దొరసానా" అంటూ ఆమె వెళ్ళినవైపే చూస్తూ నిలుచుంది.

కండువాను నెత్తిమీద కప్పుకుని, ముహూర్తం ప్రకారంగా ఎనిమిది గంటలకు సత్రంలో అడుగుపెట్టాడు పూజారి. అతని రాకను చూసి విమల మొదట వులికిపడి తరువాత తమాయించుకుంది. రంగమ్మ ఆందోళనగ చూస్తూ – నీ గొలుసు నీవు తీసుకో అంటు గొలుసున్న పిడికిలిని ఆయన ముందువిప్పింది.

"వద్దు వద్దు వుంచుకోవే రంగి. నీ బిడ్డకు ఇవ్వు" అన్నాడు.

విమల ఒక్కసారే తోకతొక్కితే బుస్సుమని పడగవిప్పిన పాములా చూసింది. పూజారి బెదిరిపోయి రంగమ్మవైపు జరిగాడు.

"నీవు బయటికి పద" అంటూ సత్రం బయటికి నడిచి "అమ్మాయి సత్రంలో వద్దంటుంది. గుడిలో అయితే ఎవరి కన్ను పడదు".

"పంచములకు గర్భగుడిలోకి ప్రవేశమా?" అని గొనిగాడు.

"నీ యిష్టం మరి. అసలే కస్ బుస్‌మంటుంది. ఒప్పుకోదు" అంది రంగమ్మ

ఆలయ కాపలాదారు ఇంటికి పోయినట్టుంది. 'ఇదే మంచి అవకాశం. అయినా దేవదాసీలు తమ మొదటి మూడు రాత్రులు గర్భగుడిలోనే పడుకోవటం ఆచారం కదా. ఈ విషయంలో శివుడు మాత్రం తక్కువా? పార్వతిని పక్కన పెట్టుకొని గంగను నెత్తిన పెట్టుకున్నాడు. శృంగారం విషయానికొస్తే అందరూ దొంగలే. నేను చేస్తే తప్పా?' అని లోలోన అనుకుంటూ "రమ్మను అంటూ గుడిలోకి నడుస్తూ, వస్తుందో లేదోనని వెనక్కి మళ్ళి చూశాడు. వస్తది పద అన్నట్టు చేత్తో సైగ చేసింది. సత్రపు ద్వారంలో నిలుచున్నది రంగమ్మ. విమల గుడివైపు వస్తూవుంది. ఆమె వచ్చేవరకు ఆగి ఇద్దరూ గర్భగుడిలోకి నడిచి శివుని ముందున్న కుంకుమను విమల నుదుట పెడుతూ–

"అయిందేదో అయింది. దిగులు పడకు. తలరాత ఎలావుంటే అలా జరుగుతుంది. మనచేతిలో ఏముంది" అన్నాడు ముసిముసిగ నవ్వుతూ.

'మనిషి తను చేసిన తప్పుల నుండి తప్పించుకోవడానికి తలరాతను అడ్డుపెడుతున్నార్రా పందుల్లారా' అనుకుంటూ పటపట పళ్ళుకొరికింది విమల.

తన మడిపంచను కింద పరిచి రమ్మని సైగచేశాడు. గుడి తలుపులు మూయమని సైగచేసింది విమల. ఒక్కసారే ముసుగు మనిషి గుర్తుకువచ్చింది. ఆమె చెప్పిన మాటలు గుర్తొచ్చాయి. అంతే తలుపులు మూస్తున్నప్పుడు శివుని చేతిలోని త్రిశూలాన్ని తన చేతుల్లోకి తీసుకొని పూజారి మెడమీదుంచి-

"జాగ్రత్త ఈ పని మానుకో లేదా ప్రాణాలు పోతాయి" అంటూ త్రిశూలంతో గట్టిగా నొక్కింది.

"ఆఁ అమ్మో చస్తి, చస్తి, మెడలోకి దిగుతుంది. తీయి తీయి" అని అరిచాడు వణుకుతూ. అప్పుడతని కళ్ళుబైర్లు కమ్మాయి. వళ్ళంతా చెమటలు పట్టింది.

"నన్ను తాకకుండా తిరిగి వెళ్ళిపోతావా మరి" అంటూ శూలాన్ని వత్తింది.

"పోత, పోత నిన్నేమి తాకును. తీయ్ తీయ్ గుచ్చుకుంటుంది." గజగజ వణుకుతూ తన చేతులతోనే శూలాన్ని మెడమీది నుండి తొలగించుకొని వెనుదిరిగి విమలవైపు చూస్తూ వణుకుతువున్నాడు.

అప్పుడు విమల విమలకాదు. ఉక్రోశంతో ఉరిమి చూస్తూ ఉద్రేకంతో ఉడికిపోతున్నది. వళ్ళంతా చెమటలు పోసి కుంకుమ బొట్టు తడిచి నుదుటి నుండి ముక్కుమీదికి జారింది. కొసలు ముడి వేసుకున్న కురులు ఇప్పుడు విప్పుకున్న అవి భుజాలను దాటి వెనుక వీపుమీద, ముందు ఎదమీద పరుచుకున్నాయి. అప్పుడు విమల అపర కాళికలా కనిపించింది. దవడలు బిగబట్టి పళ్ళు కొరుకుతూ కళ్ళు పెద్దవిగ చేసి చూస్తూ వుంది. ఆమె ముందు శివుడు వెలవెల పోవటమే కాదు, పక్కకు పడిపోయినట్టు అనిపించింది.

"వద్దు, వద్దు నన్ను ఏమీ అనొద్దు" అని బయటకు పరుగెత్తాడు పూజారి.

"ఆగు" అన్న శబ్దం విని అట్లనే ముఖం తిప్పకుండా చేతులు పైకెత్తి ఆగిపోయాడు.

"ఇదే విషయాన్ని నీ దొరతో చెప్పురా. వానికి ఈ గతే పడుతుంది. ఒరే ఈ కాలపు యువతులు అబలలు కాదురా- మీరు ఆడించినట్లు ఆడడానికి. అన్యాయాన్ని ఎదిరించే ఆది శక్తులు. కన్నెలను జెన్నెకిడిస్తే వర్షాలు వస్తాయిరా? అయితే మీ మీ కూతుళ్ళను వదలండిరా" కంఠాన్ని పెంచి గుక్క తిరక్కుండా అన్నది.

'అలాగే' అన్నట్టు తలాడించాడు.

"మీ కూతుళ్ళు కూడ ఆడపిల్లలే. వాళ్ళూ బాగ బతకాలి. అందకని అసలీ అనాగరిక విధానాలనే విడనాడాలి పో" అని గద్దించింది. అయ్యగారు వెనక్కు చూడకుండా పరుగు పరుగున నడిచారు. వెనక శివాలయం కూలినట్టు అనిపించింది.

అదే రాత్రి ఎనిమిది తరువాత కిరాణం కొట్లో కూర్చుని లెక్కలు రాసుకుంటూ

పక్కనే పళ్ళెంలో వున్న చిట్టులవలను నోట్లో వేసుకుంటున్నాడు నారాయణ. అప్పుడే అక్కడికొచ్చిన ఓ యువకుడు "కిలో చింతపండు, కిలో కారం ఇవ్వండి" అన్నాడు.

చకచకా పొట్లాలు కట్టి యువకుడు తెచ్చుకున్న సంచిలో వేస్తూ-

"మొత్తం ముప్పై రూపాయలు" అన్నాడు. యువకుడు మూడు పది రూపాయల నోట్లను తీసి ఇస్తూ-

"ఇంకా పోలేదా?" అని అడిగాడు.

"ఎక్కడికి?" అన్నాడు నారాయణ అమాయకంగా.

"గుడికి" అన్నాడు యువకుడు సంచిని చేతిలోకి తీసుకుంటూ.

"పోత" అంటూ పైసలను గళ్ళా పెట్టెలో వేసుకున్నాడు.

"లాభం లేదు. మీ కంటె ముందే పూజారి పోతే కథ అడ్డం తిరిగింది. వెనకకు పరుగెత్తుకొచ్చాడు". వస్తువులను చూస్తూ అన్నాడు.

"ఎందుకు?" అంటూ కుడిచేతి పిడికిలిని కదిలిస్తూ అడిగాడు.

"అదంతే వివరాలు అడగొద్దు" అన్నాడు యువకుడు, ఎడమచేతి చూపుడు వేలితో తన గడ్డాని తాకుతూ.

"అయినా సగం ఈడు పోయినంక ఇవేమి పాడు బుద్ధులు" అన్నాడు యువకుడు దుకాణంలో వేలాడుతున్న తరాజును చూస్తూ.

"నాకేమీ అర్థం కావటం లేదయ్యా" అన్నాడు నారాయణ. గొంతు బొంగురబోతూ వుంది.

"ఎందుకర్థం అవుతది? కాని మీరు గుడికి కాదు, గడికి పోయి దొరోనికి చెప్పండి, గుడివైపు పోవద్దని. ఒకవేళ పోయినా ఆయన ప్రాణాలతో ఉండదని. ఆయన వుంటున్న గడి వుండదని" అన్నాడు స్థిరమైన గొంతుతో స్పష్టంగా.

"దొర పానాలు పోతయా?" అయోమయంగా అడిగాడు.

"పోతయ్" అన్నాడు నిశ్చయంగా రెప్పకొట్టకుండ నారాయణవైపు చూస్తూ.

"గడి వుండదా" అనుమానంగా అడిగాడు బిత్తర చూపులు చూస్తూ.

"వుండదు" అన్నాడు కఠినంగా.

"నేను వుంటానా?" చేతులు జోడిస్తూ గాభరాగా పులి ఊళ్లోకి వచ్చిందా అన్నట్టు అడిగాడు బిత్తర బిత్తరగ చూస్తు.

"నేను చెప్పినట్టు చేస్తే వుంటవ్, లేకపోతే-" అంటూ కళ్ళు మూసాడు.

"పోతానంటావు" చూపుల్లో బెదురు, మాటల్లో అదురు మొదలైంది.

అవునన్నట్లు తల ఆడించాడు యువకుడు కళ్ళు తెరుస్తూ.

"అయితే ఏం సేయాలో సెప్పండి, సేస్తాను. అంటు లేచి దుకాణాన్ని మూస్తూ వున్నాడు. మనసులో మనసు లేదు. నన్ను మాత్రం ఏమనవద్దు నీ కాల్లు మొక్కుత" అన్నాడు పరేశాన్‌గ ఏడుపు ముఖం పెడుతూ.

"చెప్పానుగా గడికి వెళ్ళి దొరను సత్రం దగ్గర్కి వెళ్ళొద్దని చెప్పు. విమలను ముట్టుకోవద్దు అని చెప్పు. ఇంకా ఎలాంటి అఘిచిపేత చర్యకు కూడా పూనుకోవద్దు అని చెప్పు" అనగానే అప్పుడర్థమయింది అసలు కథ. ఆ యువకుడు ఎవరైందీ అర్థం అయింది. గుండె దడ మొదలయింది.

"వినకపోతే దొరను కాల్చేస్తాం. గడిని పేల్చేస్తాం అని చెప్పానుగా" అన్నాడు కఠిన స్వరంతో. నారాయణలో వణుకు వచ్చింది వల్లు చల్లగై చెమటలు కమ్మినయి.

"అవును, సెప్పారు నేను చెప్పొస్తాను" అంటూ దుకాణాన్ని మూసేసి గోచీని సర్దుకుంటూ గడివైపు నడుస్తున్నాడు. ఊళ్లోని విషయం అప్పుడే అడవిలో వుండే వాళ్ళకు అంత తొందరగ ఎట్టా తెలిసిందో అనుకుంటూ వెనక్కి మళ్ళి చూశాడు కోమిటి నారాయణ. కడుపులో గుబులు మొదలైంది. నాలుక తడారింది. యువకుడు అక్కడి నుండి కదిలి చీకట్లో కలిసిపోయాడు.

00

పంచాయతీ కార్యాలయంలో గ్రామసభ జరుగుతూ వుంది. కార్యాలయపు వరండాలో రంగమ్మ, విమల నిల్చున్నారు. అప్పటికే విమల ఇచ్చిన ఆర్జిపై తర్జనభర్జనలు జరుగుతున్నాయి. సర్పంచ్ చదువుకున్న మహిళ. కాబట్టి అప్పుడప్పుడే స్త్రీవాద సంఘాలతో సంబంధం పెంచుకుంటుంది. ఊరికి ఏదైనా మేలు చేయాలన్న ఆలోచనగల తెలివైన స్త్రీ.

"మీరంతా ఊళ్లోనే వుండి ఇంత తంతు జరుగుతు వుంటే చూస్తూ ఊరుకున్నరు" సభలో కొందరి వైపు చూస్తూ అంది.

"ఇది చట్టరీత్యా నేరం. స్త్రీకి హక్కులున్నాయి. తన పెండ్లి, ఎవరితో, ఎలా జరగాలనే నిర్ణయం తీసుకునే అధికారం వుంది. పోగా ఇదేమన్నా అడవా? గణ పెద్ద చెబితే వినడానికి. ఈ ఊరికి పంచాయితీ బోర్డ్ వుంది. దానికో సర్పంచ్ వుంది. సభ్యులు వున్నారు. వాళ్ళ నిర్ణయం ప్రకారంగా ఏదైనా జరుగుతుంది. ఇలాంటి మూఢాచారాలను బలపరచదు. ఆక్షేపిస్తుంది. నడి ఊళ్లో పట్టపగలు అందరూ చూస్తుండగానే జరిగిన ఈ ఆటవిక తంతును నిరసిస్తున్నాం.

దేవుని పేరు చెపుతూ, సాంప్రదాయమంటూ తప్పుడు పనులు చేయించే పూజారి గురించి, దొరీర్కం పేరుతో దౌర్జన్యం చేస్తూ, చేయిస్తూ తనకు తానే దొరగా చెలామణి అవుతున్న నర్సింగరావు గురించి పోలీసులకు తెలియపరచి తగు చర్యకై నిర్ణయించనైనది.

ఈ మేరకు తీర్మానాన్ని రికార్డు చేస్తూ గౌరవ సభ్యుల ముందు ఆమోదం కోసం ఉంచనైనది" అంది సర్పంచ్.

అందరు తీర్మానాన్ని ఒప్పుకుంటున్నట్టు సంతకాలు చేశారు. సభ ముగిసింది. దొరను తలా ఓ మాట అంటూ వరండాలో నిలుచున్న రంగమ్మవైపు చూస్తూ

"మేం చేయగల్గింది చేశాం" అన్నారు.

"మాలో కొందరం నిన్న జరిగింది సూసినం. మీరు ఒప్పుకున్నరేమో, పైగా కులాచారమేమోనని అంతగా పట్టించుకోలేదు. ఇకనుండి అలాంటివి జరగనివ్వం." అంటూ ఒక్కొక్కరు వెళ్ళిపోయారు. అఖరున వచ్చిన తమ కులపు సభ్యునితో "నిన్న నీవు కూడ కనిపించలేదన్న" అని రంగమ్మ అన్నప్పుడు అతను తప్పు చేసినవాడిలాగా తలవంచుకొని వెళ్ళిపోయాడు.

తీర్మానం ప్రతులను జిల్లా ఆఫీసుకు, మండలాఫీసుకు, పోలీస్‌స్టేషన్‌కు, ఎమ్మార్వో ఆఫీసుకు పంపమని కారోబార్‌కు చెప్పి వరండాలోనే నిలుచున్న రంగమ్మను, విమలను లోపలికి పిలిచి కూర్చోమంది సర్పంచ్. విమల కూర్చుంది. రంగమ్మ నిలబడే వుంది.

"నేను నిన్న జిల్లా మహిళా సంఘాన్ని కలిసి వచ్చాను. మనం వెంటనే వెళ్ళి జరిగిన విషయం చెప్పాలి" అంది సర్పంచ్.

"నేను ఈ తాళిబొట్టును, ఈ మెట్టెలను తీసేస్తాను మేడం" అంది విమల.

సర్పంచ్ కాసేపు ఆలోచించి విమల వైపు చూస్తూ-

"అయిందేదో అయింది విమలా. మనం మరో పని చేయవలసివున్నది. వాటిని కొన్ని రోజులు అట్లాగే వుండనీయి. తరువాత తీసేయొచ్చు" అంది సర్పంచ్.

వాటివల్ల కలిగే చిరాకును అణుచుకుంటూ మౌనంగా నిలుచుంది విమల.

"కోర్టులో కేసు పెడదాం. ఇకనుండి దేవుని భార్యనైన నేను దేవాలయపు పనులను చూస్తూ సత్రంలోనే వుంటానని, దీపం-ధూపం మొదలగు పూజలు నిర్వహిస్తానని, పూజారిని ఆ పనిలోనుండి తొలగించవలసిందిగా కోర్టును కోరదాం" అంది సర్పంచ్.

"సరే మేడమ్ అదే జరిగితే పూజారి రోగం కుదురుతుంది" అంది విమల.

విమలలో వస్తున్న స్పందనకు సర్పంచ్ ముఖంలో కొత్త కాంతి మెరిసింది. మనోబలం పెరిగింది. తను అనుకున్నది సాధిస్తాను అన్న నమ్మకం కుదిరింది.

"అంతేకాదు విమలా, నీవు సరిగ్గా నిలిస్తే మరో పనిచేయొచ్చు" అంది ఓ మాదిరి ఉద్వేగంలోకి వస్తూ సర్పంచ్.

"చెప్పండి మేడమ్, నాకు జరిగిన ఈ అవమానం అంతా ఇంతా కాదు. నా తల్లిని గదిలో బంధించి నన్ను ఇలా చేశారు" అంది విమల బాధగ.

"ఈ పాపం ఊర్కే పోదు. వాళ్ళు నాశనమై పోతారు" అంది రంగమ్మ.

"అసలు సంగతి ఏమిటంటే దేవాలయపు భూములు నర్సింగరావు ఆధీనంలో వున్నవి. వాటిని ఆయననుండి తప్పించాలి. వొత్తిని దీపంతను వేరుచేస్తే దీపం తనంతట తానే ఆరిపోతుంది. ముందు ఆ పనిచేయాలి" అంది సర్పంచ్.

"ఏం లేదు. దేవుని ఆస్తంతా దేవుని భార్య అయిన నీ పేరు మీదికి ట్రాన్స్‌ఫర్ చేయించమని, అట్లా చేసినట్లయితే దేవుని ఆలనా-పాలనా, పూజా పునస్కారాలు జర్పించడానికి వీలుంటుందని కోరదాం. అప్పుడు దొర ఆటలు వాటంతటవే ఆగిపోతాయి. అందుకని కొన్నాళ్ళు ఆ తాళి, మెట్టెలు ఉండనీ, ఆ తరువాత విడాకులు ఇవ్వొచ్చు" అంది సర్పంచ్.

సర్పంచ్ ప్లాన్ చక్కగా వుందనుకున్న విమల "సరే మేడమ్" అంది.

"అంత సులువా తల్లి. ఆ దొరోడు తాతముత్తాతల నుండి దుర్మార్గుడు. మనమనుకున్నట్టు సాగనిస్తాడా? వానికి తోడు మతాచారాలు మనల నోరు మూస్తాయి." అంటూ తన భయాన్ని తెలిపింది రంగమ్మ.

"ఏం కాదు. మీరు నా వెంట రండి పోవల్సిన చోటికి పోదాం" అంటూ లేచింది సర్పంచ్.

కారోబార్‌ను పిలిచి "నీవు మా వెంటరా, అలాగే వి.ఎ.ఓ. గార్ని రమ్మను. యమ్మార్వో గారితో మాట్లాడేది వుంది" అంటూ అక్కడి నుండి కదిలింది. ఆమె వెనకాల విమల, రంగమ్మ కదిలారు.

00

'శివనేనిగూడెంలో జోగిని కేసులో కోర్టు సంచలనాత్మకమైన తీర్పు' అని ఆనాటి దిన పత్రికల్లో మొదటి పేజీ ప్రధాన శీర్షిక.

• శివనేనిగూడెం గ్రామంలో బలవంతంగా ఓ దళిత యువతిని జోగినిగా మార్చిన విషయాన్ని కోర్టు దృష్టికి తేగా కేసు పూర్వాపరాలను పరిశీలించడం జరిగింది. ప్రజా పాలనలో అనాగరికమైన, అవాంఛనీయమైన సంఘటన చోటుచేసుకుని ఓ విద్యావంతురాలైన యువతి జీవితాన్ని నాశనం చేయచూశారు. గ్రామాలలో ఇంకా దొరలు ఎన్నెన్నో దౌర్జన్యాలు సాగిస్తూనే వున్నారు. కోర్టు దానిని తీవ్రంగా తీసుకుంటూ - ఆ కేసును గూర్చిన వాదోపవాదాలను, ఆ సంఘటన వివరాలను విని, అందుకు పురిగొల్పిన పూజారి శివయ్య, ఇంకా దొరగానే చెలామణి అవుతున్న నర్సింగరావు గార్లపైన మోపిన అభియోగం ప్రాథమికంగా రుజువైనందున వీరిద్దరినీ ఫైనల్ జడ్జిమెంట్ వరకు జ్యుడిషియల్ కస్టడీలో వుంచవలసిందిగా కోర్టు ఆదేశించింది.

• 2001